
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
శుక్రవారం 13 జూన్ 2025





ముగింపుదశకు చేరుకున్న కేబుల్ బ్రిడ్జి పనులు

అన్ని కాలాల్లోనూ.. అమ్మ దర్శనం..!



సిగందూరు చౌడేశ్వరి అమ్మవారు

● దేశంలోనే ఏడో అతి పెద్ద కేబుల్ వంతెన ● నెరవేరనున్న భక్తుల కల ● సిగందూరు దేవి దర్శనం ఇక సులభతరం ● ఇప్పటి వరకు బోట్లు, లాంచీల్లోనే అవకాశం

బెంగళూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన సిగందూరు అమ్మవారి దర్శనం భక్తులకు ఇకపై అన్ని కాలాల్లోనూ దక్కనుంది. ఇప్పటి వరకు కేవలం నీటిలోనే ప్రయాణించాల్సి వచ్చేది. ఒకవేళ ఎండాకాలంలో శరావతి ఎండిపోతే ఒడ్డు దాటేకి దుర్లభంగా మారేది. ఇకపై ఆ కష్టాలు తీరనున్నాయి. అతి పెద్ద కేబుల్ వంతెన నిర్మాణంతో అమ్మ దర్శనం సులభం కానుంది. రాష్ట్రంలో ప్రతి దేవాలయానికి ఓ చరిత్ర ఉంది. రాష్ట్రంలోని దేవాలయ సందర్శనలకు స్థానికులే కాకుండా వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు, విదేశీయులు వస్తుంటారు. రాష్ట్రంలో పర్యాటక, ఆధ్యాత్మికతకు అనుసంధానంగా ఉన్న కేంద్రాలు పలు జిల్లాల్లో ఉన్నాయి. మైసూరులో చాముండేశ్వరి ఆలయంతోపాటు కేఆర్ఎస్, దసరా వేడుకలు చూసేందుకు దేశ విదేశీయులు వస్తుంటారు. ఇక దక్షిణకన్నడ జిల్లా అంటే ఆధ్యాత్మికంగా ధర్మస్థళ, కుక్కె సుబ్రమణ్య, సమీపంలోని ఉడుపి శ్రీకృష్ణమఠంతోపాటు సముద్రతీరం పర్యాటకులకు ఆకర్షణగా ఉంది. అదే తరహాలోనే శివమొగ్గ జిల్లాలో జోగ్ జలపాతంతోపాటు సాగర తాలూకాలో శరావతి నది బ్యాక్‌వాటర్‌లో వెలసియున్న సిగందూరు చౌడేశ్వరిదేవిని దర్శించుకునేందుకు ఏటా లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. ఆలయానికి వెళ్లాలంటే బోట్లు, లాంచ్‌లు మినహా మరో మార్గంలేదు. వర్షాకాలంలో నదీ ప్రవాహం పెరిగితే సాధ్యం కాదు. గత ఏడాది వేసవిలో పూర్తిగా నీరు అడుగంటడంతో బోట్లు కదల్లేని పరిస్థితి ఉంది. ఇలా అతివృష్టి, అనావృష్టి అయినా సిగందూరు దేవి దర్శనం కష్టతరమే. అయితే ఇకపై భక్తుల కోరిక తీరనుంది. అమ్మవారిని ఎప్పుడయినా దర్శించుకునే అవకాశం దక్కనుంది. దశాబ్దాల కాలంగా భక్తులు, స్థానికులు ఎదురుచూస్తున్న అరుదైన అవకాశం సమీపిస్తోంది. సిగందూరు చౌడేశ్వరిదేవి ఆలయానికి వెళ్లేందుకు కేబుల్ బ్రిడ్జ్ నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. ఇటీవలే డ్రోన్ ద్వారా తీసిన వీడియోలు అత్యంత వైరల్ అవుతున్నాయి. శరావతి బ్యాక్‌వాటర్‌కు సుదూరంలో ఉండే గుట్టపై ఆలయం ఉంది. పగటివేళల్లో మాత్రమే అక్కడికి భక్తులు వెళ్లివచ్చేవారు. రాత్రివేళల్లో లాంచీలు నడపనందున సాధ్యమయ్యేది కాదు. దీంతో భక్తులు తీవ్ర నిరాశకు లోనయ్యేవారు.

2019లో శ్రీకారం..

2019లో జిల్లాకు చెందిన యడియూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీకి అనుగుణంగా వంతెన నిర్మాణాలు చేపట్టారు. కేంద్ర భూ ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరి రూ.464.23 కోట్ల రూపాయల నిధులు కేటాయించి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తైన బ్రిడ్జ్ 2.44 కిలోమీటర్ల పొడవు, 16 మీటర్ల వెడల్పుతో సిద్ధం చేశారు. 2020 డిసెంబరులో పనులు ప్రారంభమైనా కరోనా కారణంగా దాదాపు రెండేళ్లపాటు పనులు సాగలేదు. నదిలో 17 పిల్లర్‌లను ఏర్పాటు చేశారు. పిల్లర్‌ల మధ్య ప్రీ-కాస్ట్ కాంక్రీట్‌బ్లాక్‌లను అమర్చారు. నిర్మాణాలు చివరిదశకు చేరాయి. మరికొన్ని రోజుల్లోనే బ్రిడ్జ్‌పై రాకపోకలు సాగే అవకాశాలు ఉన్నాయి. సిగందూరు బ్రిడ్జ్ భారత్ కేబుల్ ఆధారిత వంతెనల్లో 7వ అతిపెద్దదిగా ఉంది. వంతెన మధ్యలో కొన్ని గర్డర్‌బాక్స్‌లను అమర్చడం మాత్రమే మిగిలి ఉంది. మరో రెండు నెలల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. సిగందూరు బ్రిడ్జ్ నిర్మాణాలు పూర్తయితే శరావతి బ్యాక్‌వాటర్‌పై ఎప్పుడు సురక్షితంగా ప్రయాణించవచ్చనే స్థానికుల కల నెరవేరనుంది. పర్యాటకానికి కొత్తశక్తిని ఇచ్చినట్లు అవుతుంది. శివమొగ్గ ఎంపీ బీవై రాఘవేంద్ర వంతెన పనులు పూర్తి కావడానికి నిరంతరం కృషి చేస్తున్నారు.



అమ్మవారి ఆలయ కార్యాలయం



కులగణన సర్వే వివరాలు ప్రకటిస్తున్న సీఎం సిద్దరామయ్య

మరోసారి కులగణన

● మంత్రివర్గం ఏకగ్రీవ నిర్ణయం.. అన్ని వర్గాలకు న్యాయం చేయడమే లక్ష్యం : సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరోసారి కులగణన సర్వే జరుపుతామని సీఎం సిద్దరామయ్య స్పష్టం చేశారు. గురువారం సీఎం అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. అనంతరం సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌తో పాటు పలువురు మంత్రులతో కలిసి సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన సర్వే జరిగి పదేళ్ళు నిండిందన్నారు. దీంతో గణాంకాల్లో తేడాలు వస్తాయన్నారు. సర్వే జరిగి పదేళ్ళు ముగిసిన మేరకు అధిష్ఠానం కొత్తగా సర్వే జరపాలని సూచించిందన్నారు. కేబినెట్ సమావేశంలో మంత్రులందరూ మరోసారి సర్వే జరిపేందుకు ఏకగ్రీవంగా ఆమోదించారన్నారు. కొత్తగా సర్వే ఏవిధంగా జరపాలనే విషయమై అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం విద్యాసంవత్సరం ప్రారంభమైన మేరకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండరని ప్రత్యామ్నాయం విషయమైనా చర్చించామన్నారు. 2011 జనాభా ప్రకారం రాష్ట్రంలో 6.11 కోట్ల మంది ఉన్నారన్నారు. 2015వ ఏడాదికి 6.35 కోట్ల మంది ప్రజల ఉన్నారన్నారు. కులగణన సర్వేలో 5.98 కోట్ల మంది పాల్గొన్నారన్నారు. అప్పట్లో 1.60లక్షల మంది సిబ్బంది, 1.30లక్షల మంది ఉపాధ్యాయులు సర్వే జరిపారన్నారు. 2018వ ఏడాది మే నెల దాకా ముఖ్యమంత్రిగా కొనసాగిన సమయానికి సర్వే నివేదికలు, సిఫారసులు పూర్తీ కాలేదన్నారు. ఆతర్వాత సీఎం కుమారస్వామి నివేదికను తీసుకోలేదని అనంతరం బీజేపీ ప్రభుత్వంలో ఇద్దరు సీఎంలు ఆ ప్రయత్నం చేయలేదన్నారు. పదేళ్ళ కిందటి సర్వేకు మనుగడ ఉండదని మరోసారి సర్వే జరుపుతున్నట్లు స్పష్టం చేశారు. అన్ని వర్గాలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

విషాదం మిగిల్చిన విహంగాలు..

రాష్ట్రంలోనూ ఘోర విమాన ప్రమాదాలు
అహ్మదాబాద్ ఘటనతో సర్వత్రా విచారం



158 మందిని బలిగొన్న మంగళూరు విమాన ప్రమాదం (ఫైల్)



బెంగళూరు, జూన్12(ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం ప్రమాదానికి గురికావడంతో సర్వత్రా విచారం వ్యక్తమవుతోంది. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్, సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లతో పాటు పలువురు నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గడిచిన 35 ఏళ్ళ వ్యవధిలో జరిగిన నాలుగు ఘోర విమాన ప్రమాదాలు వాటి ద్వారా మృతి చెందిన కుటుంబీకులలోను ఆవేదన వ్యక్తమవుతోంది. రాష్ట్రపరిధిలో నాలుగు ఘోర విమాన ప్రమాదాలు జరిగాయి.

● 1990 ఫిబ్రవరి 14న ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ల్యాండింగ్‌కు కొన్ని క్షణాల ముందు బెంగళూరు నగరంలో కుప్పకూలింది. ప్రమాదంలో 92 మంది దుర్మరణం చెందారు. అప్పట్లో హిందూస్తాన్ ఎరోనాటికల్స్ లిమిటెడ్‌కు చెందిన ప్రదేశంలోనే విమానాశ్రయం ఉండేది.

● 2004 దేశమంతటా ఎన్నికలు జరుగుతున్న వేళ ఏప్రిల్ 17న బెంగళూరు నుంచి హైదరాబాద్ ప్రాంతానికి ఎన్నికల ప్రచారం కోసం బెంగళూరు నగరం జక్కూరు నుంచి బయలుదేరిన విమానం ప్రమాదానికి గురైంది. టేక్ ఆఫ్ అయిన కేవలం రెండు మూడు నిమిషాలకే జీకేవీకే పరిధిలో కుప్పకూలింది. ప్రమాదంలో దక్షిణాది ప్రముఖ హీరోయిన్ సౌందర్య మరో ముగ్గురు దుర్మరణం చెందారు.

● 2009లో బెంగళూరు నగరం మైసూరు రోడ్ శేషగిరి హళ్ళి వద్ద ట్రైనీ విమానం కూలింది. విమానంలో సాంకేతిక లోపం రావడంతో మంటలు చెలరేగి కూలిపోగా ఇద్దరు ట్రైనీ పైలట్లు దుర్మరణం చెందారు.

● 2010లో దుబై నుంచి మంగళూరుకు వస్తున్న విమానం ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండింగ్ వేళ రన్‌వేపై నుంచి కిందకు దూసుకుపోయి ప్రమాదం జరిగింది. ఘోర సంఘటనలో 158మంది మృతి చెందారు. ఇటీవలే విమాన ప్రమాదం జరిగి 15 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ప్రత్యేకంగా విమానాశ్రయ అధికారులు, మృతుల బంధువులు ప్రత్యేకంగా నిర్మించిన స్థూపం వద్ద నివాళులర్పించారు.



మైసూరు రోడ్డులో కుప్పకూలిన శిక్షణ విమానం (ఫైల్)



బెంగళూరులో 92 మంది మృతిచెందింది ఈ ప్రమాదంలోనే.. (ఫైల్)

హత్యలపై విచారణ చేయించాలి

● దక్షిణకన్నడ జిల్లాలో వరుస ఘటనలు బాధాకరం
● ఎస్పీ, కమిషనర్‌పైనా విచారణ: స్పీకర్ యూటీ ఖాదర్



బెంగళూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా పరిధిలో ఇటీవల కొంతకాలంగా జరిగిన మతపరమైన హత్యలతో పాటు వివాదాలపై ఉన్నత స్థాయి కమిటీ ద్వారా విచారణలు జరిపించాలని శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ డిమాండ్ చేశారు. గురువారం మంగళూరులో స్పీకర్ మీడియాతో మాట్లాడిన ఆయన ఇటీవల పనిచేసిన దక్షిణకన్నడ జిల్లా ఎస్పీతో పాటు మంగళూరు నగర పోలీసు కమిషనర్‌లపైనా విచారణ జరిపించాలన్నారు. ఐపీఎస్ అధికారులందరిదీ ఒకే విధమైన పర్యవేక్షణ ఉండదన్నారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేసేవారు. సోషల్ మీడియా ద్వారా సమాజంలో ఒక వర్గానికి అనుకూలం చేసేలా పోస్టులు చేసేవారిపైనా నిఘా కొనసాగించాల్సి ఉండేదన్నారు. ఎవరినీ మరొకరు హత్య చేసే హక్కు ఉండదన్నారు. కానీ కక్షగట్టి మతాల వారీగా హత్యలు చేయడం దారుణమన్నారు. మంగళూరులో ఇటీవలి పరిణామాలు బాధాకరమన్నారు. హత్య జరిగినప్పుడు ప్రతీకారం తీర్చుకుంటామనేలా మాట్లాడిన సందర్భాలూ ఉన్నాయన్నారు. సుహాస్‌శెట్టి హత్య జరిగిన రోజున కారకులకు తగిన గుణపాఠం చెబుతామని రెచ్చగొట్టేలా మాట్లాడారన్నారు. సుహాస్‌శెట్టి హత్య కేసును ఎన్‌ఐఏకు అప్పగించిన విషయమై స్పందిస్తూ హత్య జరిగిన కుటుంబాలు కోరితే ప్రభుత్వం తగిన చర్చ జరిపి నిర్ణయం తీసుకుంటుందన్నారు.

తిరుమలలో ఎన్నో సమస్యలున్నాయి..

● అన్నింటినీ పరిష్కరిస్తాం ● దేశవ్యాప్తంగా టీటీడీ ఆధ్వర్యంలో 500 వెంకటేశ్వర ఆలయాలు నిర్మిస్తాం
● కమ్మ సంఘం ఆత్మీయ సత్కారంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



టీటీడీ చైర్మన్‌ను సత్కరిస్తున్న కమ్మ సంఘం ముఖ్యులు

బెంగళూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి) :తిరుమలలో ఎన్నో సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నానని, ఇప్పటికే భక్తులు గమనించారని మరిన్ని సంస్కరణలు తీసుకువస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ చైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. గురువారం కేఎస్ఐటీ విద్యాసంస్థల ప్రాంగణంలో కమ్మవారి సంఘం ఆధ్వర్యంలో బీఆర్ నాయుడును ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ కమ్మవారి సంఘం అధ్యక్షులు రాజగోపాలనాయుడు, సలహా కమిటీ చైర్మన్ కె. కృష్ణతోపాటు పలువురు పాల్గొన్నారు. ఈసందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడుతూ 1952లోనే కమ్మవారి సంఘం పేరుతో విద్యాసంస్థలు ప్రారంభించడం సంతోషకరమన్నారు. విద్య అందరికీ అవసరమని ఉన్నత విద్య లేకుంటే సమాజంలో జీవనం కష్టమని భావించి సంస్థలు ఏర్పాటు చేయడం నాటి కులపెద్దల దూరదృష్టికి అభినందనలన్నారు. మన కులదైవం తిరుమల వెంకటేశ్వరస్వామి కాగా టీటీడీ బోర్డు చైర్మన్ అవకాశం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కల్పించారన్నారు. టీటీడీలో పలు సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకే ప్రత్యేకంగా తిరుమలలోనే గడుపుతున్నట్లు తెలిపారు. వ్యాపారాలను వదులుకున్నానని రోజూ 18గంటల పాటు భక్తుల సేవకోసమే పనిచేస్తున్నట్లు తెలిపారు. సాధారణంగా సన్మానాలకు దూరంగా ఉంటానని కొన్ని నెలల కాలంగా బెంగళూరుకు రావాలని ఆహ్వానం ఉన్నా తిరుమలలో మరిన్ని సంస్కరణల కోసం ఎక్కడికీ వెళ్ళదలచుకోలేదన్నారు. టీటీడీ తరుపున 500 వెంకటేశ్వరస్వామి గుడులు నిర్మించదలచామని కర్ణాటకలోను ఎక్కడ స్థలం చూపినా నిర్మిస్తామన్నారు. మన కులం పరువుకు చెడ్డపేరు తీసుకురాని విధంగా తిరుమలలో మార్పులు చేస్తానని ప్రతిభక్తుడు సంతృప్తి చెందాలనేది పాలకవర్గ ఆశయమన్నారు. కార్యక్రమంలో కమ్మవారి సంఘం ఉపాధ్యక్షుడు ఎం. రుక్మాంగదనాయుడు, కార్యదర్శి లీలాశంకర్‌రావ్, కోశాధికారి నీరజాక్షులునాయుడు, యోగమూర్తి, గుర్రప్పనాయుడు, వెంకటస్వామి నాయుడుతో పాటు సలహా కమిటీ సభ్యులు, కమ్మ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆ ఇద్దరికీ కీలక పదవులు..

● కార్మిక శాఖ కార్యదర్శిగా ఐఏఎస్ రోహిణీ సింధూరి
● బెంగళూరు టాస్క్‌ఫోర్స్ అధికారిగా రూపామౌద్గిల్



రోహిణి సింధూరి

బెంగళూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖకు అనుబంధమైన ఆహార సంస్కరణ విభాగం కార్యదర్శిగా వ్యవహరిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరిని కార్మికశాఖ కార్యదర్శిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అక్రంపాషాను కేఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గాను శెట్టణ్ణనవర్‌ను బెళగావి రీజనల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. కాగా సీనియర్ ఐపీఎస్ అధికారి రూపామౌద్గిల్‌ను బెంగళూరు నగర టాస్క్‌ఫోర్స్ అధికారిగా నియమించారు. కాగా రూపామౌద్గిల్ ఐజీ హోదా నుంచి ఏడీజీపీ స్థాయికి పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. ఐఏఎస్ అధికారి రోహిణి సింధూరి, ఐపీఎస్ అధికారి రూపామౌద్గిల్‌ల మధ్య విభేదాలు సుప్రీం కోర్టు దాకా వెళ్లిన విషయం తెలిసిందే. ఇద్దరు అధికారులను చీఫ్‌సెక్రటరీ పిలిపించి మందలించారు. ఇద్దరు అధికారులు దాదాపు నాలుగేళ్ళుగా న్యాయపోరాటం చేస్తున్నారు.



రూపామౌద్గిల్


అనంతపురం నగరంలో వర్షపు నీటిలో పాఠశాల, కళాశాలకు వెళుతూ..


బుక్కరాయసముద్రం పాఠశాలలో యూనిఫాం తీసుకుని వెళ్తున్న విద్యార్థినులు


తొలిరోజు హాజరైన విద్యార్థినులు

తెరుచుకున్న పాఠశాలలు
ఉదయం జోరు వర్షం
పెద్దగా హాజరుకాని విద్యార్థులు
నామమాత్రంగా పుస్తకాలు, యూనిఫాం పంపిణీ

తొలిరోజు తడబాటు..!




నంబర్ 2 పాఠశాలలో అడ్మిషన్లు తీసుకుంటున్న ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం చేస్తూ..

అనంతపురం విద్య, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల తర్వాత గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడం, ఉదయం పాఠశాలలకు వెళ్లే సమయంలో వర్షం పడటంతో విద్యార్థులు మందకొడిగా హాజరయ్యారు. కొన్ని పాఠశాలలకు 10 నుంచి నుంచి 20 శాతం కూడా విద్యార్థులు హాజరు కాలేదు. కొన్నిచోట్ల తరగతి గదులు వెలవెలబోయాయి. తొలిరోజే విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ చేయాలని ఆదేశాలు ఉన్నాయి. కొన్ని స్కూళ్లలో నామమాత్రంగా, చాలా చోట్ల పంపిణీనే జరగలేదు. పుస్తకాలు, యూనిఫాం మాత్రమే పంపిణీ చేశారు.

మొదటి రోజు నామమాత్రంగా..

సెలవుల తర్వాత స్కూళ్లు తెరుచుకోవడంతో ఒక వైపు వర్షం పడుతున్నా.. కొందరు పిల్లల బడికి వెళ్లారు. హాస్టళ్లలో ఉంటూ చదివే పిల్లలు పెట్టెలు, ఇతర లగేజీలు తీసుకుని తల్లిదండ్రులతో కలసి చేరుకుంటూ కనిపించారు. చాలా స్కూళ్లలో హాజరు పెద్దగా కనిపించలేదు. మొదటి రోజు కావడం, శని, ఆది వారాలు మళ్లీ సెలవులు కావడంతో చాలా మంది తల్లిదండ్రులు స్కూళ్లకు పంపడానికి ఆసక్తి చూపలేదు. ఫలితంగా విద్యార్థులు లేక చాలా ప్రాంతాల్లో పాఠశాలలు వెలవెలబోయాయి. పాఠశాలల పరిసరాలను సిబ్బంది శుభ్రం చేస్తూ కనిపించారు. మొదటి రోజు కొత్త అడ్మిషన్లు, టీసీల జారీతోపాటు, పిల్లలు తక్కువగా రావడంతో కిట్ల పంపిణీ పెద్దగా జరగలేదు.


అనంతపురం రూరల్ పాఠశాలలో తక్కువగా హాజరైన పిల్లలు


తక్కువ సంఖ్యలో హాజరైన విద్యార్థులు


నంబర్ 2 స్కూల్‌లో వాలీబాల్ ఆడుతూ...



దంచికొట్టిన వాన

పొంగిపొర్లిన వాగులు, వంకలు
లోతట్టు ప్రాంతాలు జలమయం
నీట మునిగిన పంట పొలాలు


కొళగానహళ్లి గ్రామం వద్ద వరదనీటితో పారుతున్న కబ్బాలివంక

బొమ్మనహాళ్/విడపనకల్లు/ఉరవకొండ/కణేకల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి, వేరుశనగ, మొక్కజొన్న పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయ బోరుబావుల కింద పత్తి, వేరుశనగ తదితర పంటలను రైతులు సాగు చేశారు. మండలంలోని కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కొళగానహళ్లి గ్రామం వద్ద కబ్బాలివంకకు భారీగా వరదనీరు రావడంతో పొంగిపొర్లుతోంది. గాలి, వాన ఉధృతికి చెట్లు, విద్యుత్‌స్తంభాలు నేలకొరిగి విద్యుత్‌వైర్లు కిందకు వేలాడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. గోవిందవాడ గ్రామ పరిధిలో ఇసుక పొలాల్లో సాగుచేసిన వేరుశనగ పంట దాదాపు 70 ఎకరాల్లో నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లింగదహాళ్, రంగాపురంక్యాంపు, ఉప్పరహాళ్, సింగానహళ్లి తదితర గ్రామాలలో పత్తిపంట నీట మునిగింది. తెరిపిలేకుండా వానలు కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

విడపనకల్లు మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పాలికి-అంచనహాలు, గడేకల్లు-ఆర్ కొట్టాల, పాల్తూరు-కళవల్లితిప్ప, ఉండబండ-ఉరవకొండ దారుల్లోని వంకలు పొంగి పొర్లటంతో మధ్యాహ్నం వరకూ రాక పోకలు నిలిచిపోయాయి.


విడపనకల్లులోని ఎస్‌డబ్ల్యూ పాఠశాలలోకి చేరిన వర్షపు నీరు

విడపనకల్లు గ్రామంలోని ఎస్‌డబ్ల్యూ పాఠశాలలోకి వర్షపు నీరు చేరడంతో ఎవరూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడి కేంద్రంలోకి వర్షపు నీరు చేరింది. భారీ వర్షం రావటంతో ఊరి చివర ఉన్న పెద్దాసుపత్రికి వెళ్లే దారి జలమయం అయ్యింది. ఈ దారిలో ఆసుపత్రికి వెళ్లే రోగులు, వైద్య సిబ్బంది తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. మండలంలో 91.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఉరవకొండలో భారీ వర్షం

ఉరవకొండ పట్టణంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. 40మి.మీల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. భారీ వర్షానికి పాత బస్టాండ్‌లోని క్లాక్‌టవర్ కూడలిలో వర్షపు నీరు నిలబడటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శివారు ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు చేరడంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొలాలు చెరువులను తలపించాయి.

తెగిన రహదారి

కణేకల్లు మండలంలోని మీండ్లపల్లి-గరుడచేడు మధ్య ఉన్న రహదారి బుధవారం రాత్రి కురిసిన వర్షానికి తెగింది. ఈ దారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోగా, అనుబంధంగా ఉన్న కల్వర్టు, రహదారి రెండూ వర్షం వల్ల తెగిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. కణేకల్లు క్రాసింగ్‌తోపాటు పలు ప్రాంతాలలో స్తంభాలు ఒరగడంతో విద్యుత్ సమస్యలు ఏర్పడ్డాయి.


మీండ్లపల్లి, గరుడచేడు మధ్య తెగిన రహదారి

లక్షణాలు ఉంటే కరోనా పరీక్షలు

ప్రత్యేక కొవిడ్ వార్డు ఏర్పాటు

● ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు



అనంతపురం టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కరోనా కేసులు జిల్లాలో మళ్లీ పెరుగుతున్నాయి. అనుమానిత లక్షణాలతో వస్తున్న వారికి పరీక్షలు చేస్తుండగా పాజిటివ్ వస్తోంది. ఇప్పటికే వరుసగా జిల్లా ఆసుపత్రిలో పరీక్షలు చేసిన వారిలో ఐదుగురికి పాజిటివ్ నిర్ధారణ అయింది. ఆసుపత్రిలో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఆసుపత్రిలో తీసుకుంటున్న చర్యలు గురించి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు పలు విషయాలను వెల్లడించారు.

ఇంటర్వ్యూ

ప్రశ్న : కరోనా పరీక్షలు ఎంతమందికి చేశారు..?
జవాబు : కరోనా ప్రభావం మళ్లీ రావడంతో అనుమానిత లక్షణాలతో ఆసుపత్రికి వచ్చే వారికి పరీక్షలు నిర్వహిస్తున్నాం. గత 15 రోజులుగా ఈ పరీక్షలు చేస్తున్నాం. ఇప్పటికి 37 మందికి పరీక్షలు చేయగా.. ఐదుగురికి పాజిటివ్ వచ్చింది.

ప్రశ్న : కరోనా బాధితులకు చికిత్సలు ఎక్కడ అందిస్తున్నారు..?
జవాబు : జిల్లా సర్వజన ఆసుపత్రిలో కరోనా బాధితులకు అవసరమైన వైద్యం అందించడానికి ఏర్పాట్లు సిద్ధం చేశాం. 48 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశాం. ఆ విభాగానికి డాక్టర్లు, సిబ్బందిని నియమించాం. కోఆర్డినేటర్‌గా డాక్టర్ రమేష్‌ను నియమించాం.

ప్రశ్న : మందులు, మాస్కులు, ఇతర పరికరాలు ఉన్నాయా..?
జవాబు : కరోనా బాధితులకు అవసరమైన మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికి ఐదుగురికి పాజిటివ్‌రాగా.. ఇందులో ముగ్గురు హోమ్‌ఐసోలేషన్‌లో ఉంటున్నారు. మరో ఇద్దరు జిల్లా ఆసుపత్రిలోని ప్రత్యేక వార్డులో చికిత్స తీసుకుంటున్నారు. అవసరమైన మందులు ఉన్నాయి. మాస్కులు, శానిటైజర్, గ్లౌజులకు ఇండెంట్ పెట్టాం.

ప్రశ్న : కరోనా నియంత్రణకు ఏమి చేయాలి..?
జవాబు : ప్రతి ఒక్కరు మాస్క్ ధరించడం, సామాజిక దూరం పాటించడం, చేతులను శానిటైజర్‌తో శుభ్రం చేసుకుంటూ ఉండాలి. ఆసుపత్రికి వచ్చే రోగులకు అవగాహన కల్పిస్తున్నాం.

అక్రమాల ఆట..!



అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఆడుదాం.. ఆంధ్రా.. పోటీలు నిధులు బొక్కేసేందుకే నిర్వహించారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. నాలుగేళ్లూ క్రీడలను గాలికొదిలేసిన గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆడుదాం ఆంధ్రా అంటూ నిధులు దోచేసే ఎత్తు వేసింది. క్రీడలంటే తెలియని వారికి పోటీలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కూడా పాల్గొన్నారు. వారికి నీరు కూడా ఇవ్వలేదు. ఏకంగా భోజనాలే పెట్టినట్లు బిల్లులు భోంచేశారు. క్రీడాకిట్ల నాణ్యత గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. నాసిరకమైన వాటిని సరఫరా చేశారు. ఇలా..అడుగడుగునా అక్రమాలకు పాల్పడ్డారు. ఉమ్మడి జిల్లాలో రూ.70 లక్షల వరకు నిధులను కాజేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంతులేని అవినీతిపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆ మేరకు విజిలెన్స్ అధికారులు మూడు బృందాలుగా బుధవారం విచారణ చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 25 మండలాల్లో విచారణ పూర్తి చేసినట్లు తెలిసింది. దీంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది.

జగన్ బొమ్మలతో నాసిరకం కిట్లు

వైసీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ బొమ్మలతో నాసిరకంగా స్పోర్ట్స్ కిట్లు, టీ షర్టులు అందజేశారు. ప్రభుత్వాధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించినా... అంతా వైసీపీ నేతల కనుసన్నల్లోనే జరిగాయి. ఆటలపై కనీస అవగాహన లేని పిల్లలను మైదానంలోకి తీసుకువచ్చి... ఆడించడంతో పలుచోట్ల గొడవలు తలెత్తాయి. పలుచోట్ల పోటీలను వాయిదా వేయాల్సి వచ్చింది కూడా. ఇలా.. వైసీపీ నేతలు, అధికారులు అడ్డగోలుగా నిధులను కాజేశారు. ఆడుదాం ఆంధ్రా పోటీల సమయంలో ఉన్న అనంతపురం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి(డీఎస్‌డీఓ) నిధులను దోచేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి పాలనలోనూ ఆ అధికారికి అందలం దక్కడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది



ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు సంబంధించి విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. వివరాలు అడిగిన వెంటనే అందజేస్తున్నాం. ఆడుదాం ఆంధ్రా క్రీడాసామగ్రిని నార్పల స్టేడియంలో భద్రపరిచాం.
- ఉదయ్‌భాస్కర్, అనంతపురం, శ్రీసత్య జిల్లాల క్రీడాభివృద్ధి అధికారి


తుప్పు పట్టిన క్లోరినేషన్ సిలిండర్ అమర్చే పరికరాలు


పనిచేయని ఆలం మిక్చర్ ప్లాంట్ మోటారు

వైసీపీ హయాంలో విడుదల కాని నిధులు
కరుమరుగైన క్లోరినేషన్
తుప్పుపట్టిన పరికరాలు
సత్యసాయి తాగునీటి సరఫరాకు వెంటాడుతున్న కష్టాలు

నీటిశుద్ధిపై నిర్లక్ష్యం

కూడేరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరాపైనా వైసీపీ పాలకులు నిర్లక్ష్యం వహించారు. గత పాలనలో సత్యసాయి నీటిశుద్ధి కేంద్రానికి నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో నిర్లక్ష్యానికి గురయింది. నాలుగేళ్లుగా నీటిని శుద్ధిచేయడానికి వినియోగించే క్లోరినేషన్ గ్యాస్‌ను వాడలేదు. కూడేరు మండలం పీఏబీఆర్ డ్యాంలోని సత్యసాయి తాగునీటి శుద్ధి కేంద్రంలో నీటిని శుద్ధి చేయడానికి వినియోగించే క్లోరినేషన్ గ్యాస్‌తోపాటు ఆలం మిక్చర్ మోటర్లు, పైపులు, ఇతర పరికరాలు పూర్తిగా దెబ్బతిని తుప్పు పట్టాయి. క్లోరినేషన్‌తోపాటు ఆలం ఉపయోగించి నీటిని శుద్ధి చేస్తారు. ఏరియేటర్‌లో నుంచి వచ్చే నీరు అపరిశుభ్రంగా ఉంటే అలంతోపాటు క్లోరినేషన్ గ్యాస్ కలుపుతారు. ఆ నీరు క్లారియేటర్‌కి వెళ్లి అక్కడ శుభ్ర పరిచిన అనంతరం నీరు మొత్తం ఫిల్టర్ హౌస్‌లోకి వెళ్తాయి. నీటిలో కలిపే క్లోరినేషన్ గ్యాస్ మాయమయింది. దీని స్థానంలో బ్లీచింగ్ పౌడర్‌ను కలపడం, ఆలం గడ్డలను నేరుగా నీటిలోకి వేయడంతో సక్రమంగా శుద్ధి కాలేదు. పీఏబీఆర్‌డ్యాంలోని సత్యసాయి తాగునీటి ప్లాంట్ నుంచి కూడేరు, ఆత్మకూరు, అనంతపురం రూరల్, కళ్యాణదుర్గం, కుందుర్పి, బెళుగుప్ప, ఉరవకొండ, రాప్తాడు, కంబదూరు తదితర మండలాల్లో దాదాపు 150 గ్రామాలకు నీటి సరఫరా జరుగుతోంది. పథకం ప్రారంభం నుంచి ఎల్‌అండ్‌టీ సంస్థ ఆధ్వర్యంలో శుద్ధి కేంద్రాన్ని నిర్వహించారు. వైసీపీ అధికారంలోకి రాగానే సత్యసాయి తాగునీటి పథకానికి నిధులు విడుదల చేయకపోవడంతో ఎల్‌అండ్‌టీ నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంది. అప్పటి నుంచి సత్యసాయి తాగునీటి పథకం నిర్లక్ష్యానికి గురయింది. నిధులు సక్రమంగా రాకపోవడంతో ప్లాంట్ నిర్వహణ, కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొంది. నీటిని సరఫరా చేసే విద్యుత్ మోటర్ ఇటీవల కాలిపోవడంతో దాదాపు 22 రోజులు నీరు బంద్ అయ్యాయి. దీంతో గ్రామాల్లో తాగునీరు లేక జనం అల్లాడిపోయారు. అదనపు మోటర్ లేకపోవడంతో కొత్త మోటర్ కొనుగోలు చేసి తీసుకురావడానికి ఇన్ని రోజులు పట్టింది. సత్యసాయి నీటి సరఫరా చరిత్రలో ఇలా జరగడం తొలిసారి. ఏరియేటర్ నుంచి వచ్చే నీటిలోకి బ్లీచింగ్‌తోపాటు ఆలంను కలిసిన నీరు క్లారియేటర్‌లోకి వెళితే ఆ నీరును శుద్ధి చేయడానికి వినియోగించే మోటర్ గత నాలుగు సంవత్సరాలుగా పని చేయలేదు. దీంతో క్లారియేటర్‌లోకి వచ్చిన నీరు వచ్చినట్లు ఫిల్టర్ హౌస్‌లోకి వెళుతున్నాయి. అక్కడి నుంచి సంపులోకి పంపి గ్రామాలకు సరఫరా చేస్తున్నారు.


పనిచేయని క్లారియేటర్ మిషన్

మరమ్మతులకు నిధులు విడుదల

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సత్యసాయి తాగునీటి పథకంలో పనిచేయని క్లోరినేషన్ ప్లాంట్ మరమ్మతులకు నిధులు విడుదలయ్యాయి. గత ప్రభుత్వంలో నిధులు సక్రమంగా రాకపోవడంతో క్లోరినేషన్ గ్యాస్ వినియోగించలేదు. కేవలం బ్లీచింగ్ పౌడర్ కలిపి నీటిని సరఫరా చేశాం. ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నాలుగు నీటిశుద్ధి కేంద్రాల్లో క్లోరినేషన్ గ్యాస్ ప్లాంట్ తోపాటు ఆలం కలిపే ప్లాంట్లకు మరమ్మతులు చేస్తాం.
-రామారావు, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్

మద్దతు ధరలతో ఊరట



చిలమత్తూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పండించిన పంటకు సరైన ధరలు లభించక నష్టాలకు గురవుతున్న రైతులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రధానంగా మొక్కజొన్న, కంది, రాగి, వేరుశనగ పంటలకు మద్దతు ధరలను పెంచుతూ తీసుకున్న నిర్ణయంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పెట్టుబడులు పెట్టి పంట చేతికందిన తరువాత గిట్టుబాటు లేక దళారుల చేతుల్లో మోసపోతున్న రైతులకు పెంచిన ప్రభుత్వ మద్దతు ధరలు ఎంతో లాభదాయకంగా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో గిట్టుబాటు ధరలు లేక, పండిన పంటను సరైన ధరలకు అమ్ముకోలేక నానా ఇబ్బందులు పడ్డారు. పెంచిన మద్దతు ధరలు ఈ ఖరీఫ్ నుంచి అమల్లోకి రానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ తరుణంలో మంచి గిట్టుబాటు ధర కలిగిన మొక్కజొన్న, రాగి, కంది పంటలపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయాధికారులు సలహా ఇస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా వేరుశనగ పంట పండిస్తున్నారని, ఆ పంటకు కొంత విరామం ఇచ్చి మిగిలిన పంటలను సాగుచేసుకుంటే అధిక ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

పెరిగిన మద్దతు ధరలు

తీవ్ర నష్టాలకు గురవుతున్న రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వం పండిన పంటలకు మద్దతు ధరలు ప్రకటించింది. మొక్కజొన్న పంట క్వింటాలుకు రూ. 2,400, రాగి పంటకు రూ. 4,886, కందులుకు రూ. 8 వేలు, వేరుశనగ క్వింటాలుకు రూ. 7,263 గా ప్రభుత్వం ప్రకటించింది. గతంతో పోల్చితే ఈ ఏడాది మద్దతు ధరలు బాగా పెరిగాయి.

దళారుల పాలయ్యేవి..

వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక కల్లాల్లోనే అందినకాడికి అమ్ముకునేవారు. దళారులు ఎంత చెబితే అదే ధర. పంట పండినా మద్దతు ధరకు అమ్ముకోలేక రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం మొక్కజొన్న, రాగి, కంది, వేరుశనగ పంటలకు గిట్టుబాటు ధరలు ప్రకటించి కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంది. గతంలో బహిరంగ మార్కెట్‌లో రాగి పంట క్వింటాలు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు పలికేది. ఇప్పుడు ప్రభుత్వం క్వింటాలుకు రూ. 4,886 మద్దతు ధర ప్రకటించింది. మొక్కజొన్న క్వింటాలుకు రూ. 2 వేల నుంచి రూ. 2,200 వరకు ఉండగా.. ఇప్పుడు ప్రభుత్వ మద్దతు ధరే రూ. 2400 ప్రకటించింది. కంది పంట మార్కెట్లో క్వింటాలు రూ. 5,500 నుంచి రూ. 6,500 వరకు ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం ఏకంగా రూ. 8 వేల మద్దతు ధర ప్రకటించింది.

గిట్టుబాటు ధరలతో రైతులకు మేలు



ప్రభుత్వం గత ఏడాది కంటే మొక్కజొన్న, రాగి, కంది, వేరుశనగ పంటలకు మంచి మద్దతు ధర ప్రకటించింది. ఈ ధరలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రధానంగా ఈ ప్రాంతానికి అనువైన మొక్కజొన్న, కంది, రాగి పంటలపై రైతులు ఆసక్తి చూపాలి. తక్కువ పెట్టుబడితో మంచి లాభం పొందడానికి అవకాశం ఉంది. మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేకపోతే.. మద్దతు ధరతో ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. రైతులు ఈ విషయాన్ని గుర్తించుకోవాలి.
-వంశీకృష్ణ, మండల వ్యవసాయాధికారి, చిలమత్తూరు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కె.శె. శంకరనారాయణ కాలమ్...

డబ్ల్యుబి ఈట్స్ (జయంతి)



ఐరిష్ కవిగా పేరొందిన విలియం బట్లర్ ఈట్స్ 1865 జూన్ 13న జన్మించారు. ఐర్లండ్ దేశానికి చెందిన ఆయన గొప్ప కవిగా, నాటక కర్తగా, రచయితగా రాణించారు. 20వ శతాబ్దపు సాహితీవేత్తలలో గుర్తింపు పొందారు. అబ్బే థియేటర్ ఏర్పాటులో సహకారం అందించారు. ఐరిష్ ఫ్రీ స్టేట్‌కు రెండుసార్లు సెనేటర్‌గా వ్యవహరించారు. 1923లో నోబెల్ సాహితీ పురస్కారం అందుకున్నారు. 1939 జనవరి 28న కన్నుమూశారు.

ఈఎంఎస్ నంబూద్రిపాద్ (జయంతి)



కేరళ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఈఎంఎస్‌గా చిరపరిచితులైన ఏలాంకుళం మనక్కల్ శంకరన్ నంబూద్రిపాద్ 1909 జూన్ 13న మలప్పురం జిల్లా పెరింతాళ్‌మన్న తాలూకా ఏలాంకుళం గ్రామంలో జన్మించారు. 1957-59 మధ్య, తర్వాత 1967-69 మధ్య కూడా సీఎం అయ్యారు. కాంగ్రెస్ పార్టీయేతర కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ)కు చెందిన తొలి సీఎం కావడం విశేషం. కేరళ రాష్ట్రంలో సమాజంలో అధికారంలో ఆర్థిక వనరుల వికేంద్రీకరణకు, అక్షరాస్యత కోసం ఎన్నో సంస్కరణలు తెచ్చారు. రచయితగా ఎన్నో రచనలు చేసి మళయాళ సాహిత్యంలో ఒక మైలురాయి తెచ్చారు. 1998 మార్చ్ 19న కన్నుమూశారు.

దీపికా కుమారి (పుట్టినరోజు)



విలువిద్య (ఆర్చరీ)లో 'పద్మశ్రీ' గ్రహీత దీపికా కుమారి 1994 జూన్ 13న బీహార్ రాష్ట్రం రాంచీ (ప్రస్తుతం జార్ఖండ్) ప్రాంతంలో జన్మించారు. నాలుగుసార్లు ఒలింపియన్‌గా, రెండుసార్లు వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్ సిల్వర్ మెడలిస్ట్‌గా రాణించారు. 2010 కామన్వెల్త్ గేమ్స్‌లో మహిళా విభాగంలో బంగారు పతకం సాధించారు. 2012 సమ్మర్ ఒలింపిక్స్‌లోనూ పాల్గొన్నారు. అర్జున అవార్డు అందుకున్నారు. ఎఫ్ఐసీసీఐ స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ 2014 అవార్డు, 2016లో పద్మశ్రీ, 2017లో యంగ్ అచీవర్స్ అవార్డు పొందారు. 2021లో హ్యుండై ఆర్చరీ వరల్డ్‌కప్‌లోనూ సత్తా చాటుకున్నారు. షాంఘైలో 2024 ఏప్రిల్‌లో నిర్వహించిన హ్యుండై ఆర్చరీ వరల్డ్ సర్క్యూట్ పోటీల్లో పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ఇంటి అవకాశం

బెంగళూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రతి వ్యక్తి సొంతింటి కల కంటారు. పేద, మధ్యతరగతి వర్గాలకు అనుకూలంగా ప్రభుత్వం కూడా పలు పథకాలు అమలు చేస్తోంది. తాజాగా మ్యాజిక్‌హోమ్ సంస్థ సరికొత్తగా ఎల్‌జీబీటీ ట్రాన్స్‌జెండర్లకు కూడా ఇంటి అవకాశం కల్పిస్తోంది. ఇళ్ల నిర్మాణాలే కాకుండా అభయారణ్యాలను తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని సంస్థ ప్రతినిధి జయెశ్కాలి నగరంలో ఓ ప్రకటనలో తెలిపారు.

కుమారుడిపై దాడి

ఆగిన అమ్మ గుండె

బాగేపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): భూవివాదం కారణంగా యువకుడిని ప్రత్యర్థి వేటకొడవలితో దాడికి పాల్పడ్డారు.. కుమారుడిపై దాడిని చూసిన తల్లి గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన చిక్కబళ్ళాపుర జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లా పెరేసంద్ర పోలీసుస్టేషన్ పరిధిలోని కొరేనహళ్ళిలో గురువారం చోటు చేసుకుంది. పొలం వద్ద నవీన్ అనే యువకుడిని శివణ్ణ అలియాస్ శివశంకర్‌రెడ్డి అనే వ్యక్తి దాడికి పాల్పడ్డారు.. ఇదే సమయంలోనే అక్కడే ఉన్న తల్లి యశోదమ్మ కుమారుడిపై సాగుతున్న దాడిని కళ్లారా చూసి ఒక్కసారిగా కుప్పకూలి గుండెపోటుకు గురై మృతిచెందారు. దాడికి పాల్పడిన శివశంకర్‌రెడ్డి పరారీ అయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా దాడికి పాల్పడిన శివశంకర్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు తెలిసింది.

రుణం ఇప్పిస్తామంటూ నకిలీ నోట్లతో వంచన

● మహిళ ఫిర్యాదుతో నిందితుడి అరెస్టు

బెంగళూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తక్కువ వడ్డీకి రుణం ఇప్పిస్తానంటూ నమ్మించిన ఒక వ్యక్తి చివరకు నకిలీనోట్లు ఇచ్చి మోసానికి పాల్పడిన ఘటన హుబ్బళ్ళిలో చోటు చేసుకుంది. మైసూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి మహ్మద్ ఆసిఫ్ మోసానికి పాల్పడిన ఇతను, పూనెకు చెందిన మహిళకు రూ.50కోట్ల రుణం ఇప్పిస్తానని నమ్మించాడు. ప్రాసెసింగ్ ఫీజుకోసం ఆమెనుంచి రూ.60లక్షలు పొందాడు. తర్వాత తొలికంతుగా మహిళకు రూ.1.87 కోట్లు ఇచ్చాడు. ఆమె బ్యాగులోని కరెన్సీ నకిలీదిగా గుర్తించింది. మహ్మద్ ఆసిఫ్, సుధీర్ మెహతాగా పరిచయం చేసుకుని వంచనకు పాల్పడినట్లు తెలుస్తోంది. పారిశ్రామికవేత్తలకు అప్పులు ఇచ్చే పెద్ద ఫైనాన్షియర్‌లు తెలుసని పలువురిని వంచించినట్లు తెలుస్తోంది. ఇదే రీతిన సదరు మహిళకు ఈనెల 5న హుబ్బళ్ళిలోని ఒక హోటల్‌లో రెండు సూట్‌కేసులతో నగదు నింపి ఇచ్చాడు. ప్రస్తుతానికి 1.87కోట్లు ఇచ్చామని, మిగిలిన రూ.48 కోట్లను త్వరలోనే ఇస్తామన్నారు. తర్వాత సూట్‌కేసులోని నగదును బ్యాగులోకి ఆమె సర్దుకునే ప్రయత్నంలో గమనించగా అవి నకిలీవని తేలింది. ఒక్కో బండిల్‌పై ఒక్కనోటు మాత్రం ఒరిజినల్‌నోటు ఉండగా మిగిలిన నోట్లు నకిలీవి. బాధితురాలి ఫిర్యాదు మేరకు విద్యానగర్ పోలీసులు కేసునమోదు చేసుకున్నారు. సీసీబీ పోలీసులు తీవ్రంగా పరిగణించి మురుడేశ్వర్‌లో తలదాచుకున్న నిందితుడిని మంగళవారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పరచగా జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కాగా నకిలీనోట్లను తమిళనాడులో ప్రింట్ చేసినట్లు దర్యాప్తులో తేలింది.



చిన్నారులతో కలిసి ర్యాలీలో మంత్రి సంతోష్‌లాడ్, నటి అదితి ప్రభుదేవా



నగర వీధుల్లో చిన్నారుల ర్యాలీ

బాలలను కార్మికులుగా మార్చరాదు: మంత్రి

బెంగళూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బడికి వెళ్లే వయసులో బాలలను కార్మికులుగా మార్చరాదని కార్మికశాఖామంత్రి సంతోష్‌లాడ్ అభిప్రాయపడ్డారు. బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని గురువారం కబ్బన్‌పార్కులో చైతన్య ర్యాలీ జరిపారు. జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన మంత్రి చిన్నారులతో కలసి నడిచారు. ఇదే సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బాలకార్మికులు తగ్గారనాన్నరు. కూలి పనుల కోసం నగరాలకు వచ్చే వలసకార్మికుల చిన్నారులకు ఎక్కడికక్కడ చదువుకునే సౌలభ్యం కల్పిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా వచ్చిన ప్రముఖ హీరోయిన్ అదితి ప్రభుదేవా మాట్లాడుతూ.. బాలలను కార్మికులుగా మార్చరాదనేది ఒక ఉద్యమం కావాలని ప్రతి పౌరుడు బాధ్యతగా భావించాలన్నారు. బాల్యంలో చదువుకోకుంటే మరెప్పుడూ సమగ్ర విద్యను పొందలేరన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో 25 మంది మేఘాలయ విద్యార్థులు



మేఘాలయ విద్యార్థులతో టీచర్లు, హాస్టల్ సిబ్బంది

● ఇంగ్లీష్ మీడియం భేష్ అంటూ ప్రశంసలు

బాగేపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బాగేపల్లి పట్టణంలోని పీఎంశ్రీ ప్రభుత్వ ఆంగ్ల మీడియం ప్రాథమిక పాఠశాలలో మేఘాలయ రాష్ట్రానికి చెందిన 25మంది విద్యార్థినులు చేరారు. బాగేపల్లి తాలూకాలోని పెనుమలె గ్రామం హాస్టల్‌కు వచ్చిన విద్యార్థులు పట్టణంలోని పీఎంశ్రీ బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం చేరినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్ హనుమంతరెడ్డి తెలిపారు. విద్యార్థులందరికీ పుస్తకాలు పంపిణీ చేశారు. తాలూకాలోని దేవరగుడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో పెనుమలె గ్రామంలో సౌమ్య కేసానుపల్లి సహకారంతో పుణ్యకోటి ట్రస్టు ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి విద్యార్థుల హాస్టల్‌ను ప్రారంభించారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండే బాలికలకు ఇక్కడ సదుపాయం ఉంది. మేఘాలయ నుంచి బాలికలు హాస్టల్‌కు వచ్చారు. పట్టణంలోని పీఎంశ్రీ ప్రభుత్వ పాఠశాలకు 25 మంది బాలికలు చేరారని హాస్టల్ అధికారి రుద్రమ్మ తెలిపారు. 2నుంచి 7వ తరగతి దాకా అన్ని తరగతుల్లోనూ చేరారన్నారు. హాస్టల్‌లో చేరిన పిల్లలు హిందీ భాష మాట్లాడతారని, స్కూల్‌లో ఇంగ్లిష్‌మీడియంలో చేర్పించినట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సౌలభ్యాలు ఉంటాయన్నాయరు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంతోపాటు గుణాత్మక విద్య అందిస్తున్నట్టు తెలిపారు. బాలికల ఆరోగ్యంపట్ల దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. హాస్టల్‌నుంచి పాఠశాలకు వెళ్లేందుకు బాలికలకు వాహన వ్యవస్థ ఉందన్నారు. 3నుంచి పదో తరగతి వరకు పిల్లలను చేర్పించే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు మంజునాథరెడ్డి, నరసింహమూర్తి, టీచర్ ధర్మపుత్రి, బేబిమమతాజ్, భార్గవి, రజిని, కవిత, ఉషా, పద్మజ, రాధికా, శ్రీలేఖ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఆధునికీకరించిన ఆర్ట్ గ్యాలరీ ప్రారంభం



ప్రారంభోత్సవంలో డీసీఎం డీకే శివకుమార్, మంత్రి హెచ్‌కే పాటిల్ వెంకటప్ప



ఆర్ట్ గ్యాలరీ భవనం

బెంగళూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆధునీకరించుకున్న ఆర్ట్‌గ్యాలెరీని శాసనసభ వ్యవహారాలు, పర్యాటకశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీఎం డీకే శివకుమార్, ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్, బ్రిగేడ్ గ్రూప్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంఆర్ జైశంకర్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ సాంస్కృతిక పరంపరను ప్రోత్సహించేలా జైశంకర్ చేపట్టారని కొనియాడారు. వెంకటప్ప గ్యాలరీ భవనానికి సంబంధించి దెబ్బతిన్న పైకప్పు, గోడలను బాగుచేసి ఆధునీకరించారన్నారు. ప్రజలకు ఉన్నతమైన సౌలభ్యాలు కల్పించారన్నారు. రాష్ట్రానికి చెందిన ప్రముఖ కళాకారులు వెంకటప్ప, కేకే హెబ్బార్‌కు సమర్పించిన గ్యాలరీ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇక్కడ ఐదు చిన్నగ్యాలరీలకు అవకాశం ఉందన్నారు. సందర్శకులకు స్నేహస్థలాన్ని రూపొందించారన్నారు. దీనికితోడు పుస్తకాల ప్రదర్శనకు వీలు కల్పించారన్నారు. సమకాలీన, చారిత్రక కళాకృతులను సంరక్షించడానికి, మళ్లీ రూపొందించే సాధనాలను అందుబాటులో ఉంచారన్నారు. ఆడిటోరియంపై ఆధునిక కెఫెటేరియా ఏర్పాటు చేశారన్నారు. ఆధునీకరించిన స్థలం కళాకారులకు, భావితరాలకు అనుకూలం కానుందన్నారు.

రోడ్డుపక్కన మాంసపు వ్యర్థాలు

● దుర్వాసనతో బెంబేలు ● స్థానికుల ఆగ్రహం



మాంసపు వ్యర్థాల బస్తాలు

చింతామణి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చింతామణి తాలూకాలోని పవిత్రయాత్రా స్థలమైన మురగమల్ల ప్రధాన రహదారికి అనుబంధంగా రైల్వే అండర్‌పాస్ సమీపాన, కరియపల్లి చెరువు, హిందూ స్మశానవాటిక, పంట పొలాలకు వెళ్లే మార్గాల పక్కన ఇటీవల రాత్రివేళల్లో మాంసపు వ్యర్థాల మూటలను పడేశారు. వీటినుంచి వెలువడే దుర్వాసనతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పశుమాంస వ్యర్థాలను కవర్లలో నింపి వాటినిపెద్ద సంచులలో వేసి పడేశారు. మూడు నాలుగురోజులక్రితం సుమారు వేర్వేరుచోట్ల 20కుపైగా బస్తాలలో వ్యర్థాలను పడేశారు. ఇటీవలకురిసిన వర్షాలతో వ్యర్థాలు కుళ్లడంతో దుర్గంధం నెలకొంది. ఈ వాసన కారణంగా తోటలు, పొలాల్లో పనులకు కూలీలు రావడం లేదు. ఇందుకు సంబంధించి కరియపల్లి గ్రామస్థులు కాగతి గ్రామపంచాయతీ పీడీఓ లోకేశ్‌ను సంప్రదించి వ్యర్థాలను తొలగించే చర్యలు చేపట్టాలని కోరగా దర్పం ప్రదర్శించారు. దీంతో ఆగ్రహానికి లోనైన గ్రామస్థులు పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం గ్రామపెద్దల తీర్మానం మేరకు తహసీల్దార్‌కు విన్నవించాలని నిర్ణయించారు. ఈనెల 10న తహసీల్దార్ యాదవ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పీడీఓను తహసీల్దార్ మందలించారు. చివరకు పొక్లైనర్‌తో గుంతతీసి వ్యర్థాలను పూడ్చిమట్టితో కప్పారు. చింతామణి ఉపవిభాగం డీఎస్పీ మురళీధర్ స్పందిస్తూ ఇష్టంవచ్చినట్టు వ్యర్థాలు పడేస్తే కఠినచర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.



చిన్నారులకు చదువుపై ఆసక్తి పెంచాలి



అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు

బెంగళూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు చదువుపై ఆసక్తి పెంచేలా ప్రోత్సహించాలని సెయింట్ ఫ్లవర్స్ గ్రూప్ విద్యాసంస్థ అధ్యక్షుడు జీఆర్ కృష్ణప్ప అభిప్రాయపడ్డారు. విజయనగర్ చంద్రా లే అవుట్‌లోని పాఠశాలలో గురువారం విద్యార్థులకు తల్లిదండ్రులతో కలసి అక్షరాభ్యాసం ప్రారంభించి మాట్లాడారు. 2025-26 సంవత్సరానికి ప్రి-నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ప్రారంభించామని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తమ పిల్లలను చేర్పిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. విద్యాసంస్థల వ్యవస్థాపక డైరెక్టర్ దర్శన్ కృష్ణ, ప్రిన్సిపాల్ సౌమ్య, వినుత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక కోసం..
నదీ గర్భంలో
గోతులు తవ్వుతున్నారు..
పెద్దపెద్ద రోడ్లు వేసి..
పేలికలు చేస్తున్నారు..

ఆహ్లాదాన్ని పంచే నదిని..
కళావిహీనంగా మార్చేశారు..
చిత్రావతిని చిత్రహింసలు
పెడుతున్నారు..

యల్లనూరు కాజ్‌వే వద్ద చిత్రావతి నదిలో పక్కపక్కనే వేస్తున్న మట్టి రోడ్లు



చిత్రహింసలు..!

చిత్రావతిలో యథేచ్ఛగా


ఇసుక తవ్వకాలు

వాహనాలు వెళ్లేందుకు రోడ్ల నిర్మాణం

కళతప్పిన నది

కాజ్‌వేలకు ముప్పు

↓ లక్షుంపల్లి వద్ద నది మధ్యలో ఏర్పాటుచేసిన రహదారి ↓



ఇసుకాసురులు చిత్రావతి నదిని ఛిద్రం చేస్తున్నారు. ఒకప్పుడు చూడచక్కగా ఉండే నది నేడు రహదారుల ఏర్పాటు, ఆక్రమణలతో రూపురేఖలు మారి కళతప్పింది. మండల పరిధిలో చిత్రావతి సుమారు 15 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. ఇసుకాసురుల కన్ను నదిపై పడింది. ఇసుకను తరలిస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ఇసుక తరలింపు కోసం ఉపయోగించే ట్రాక్టర్లు, టిప్పర్లు, లారీలు సులువుగా నదిలో నుంచి బయటకు వచ్చేందుకు ఏకంగా రోడ్లు వేసుకుంటున్నారు. ఈ రహదారుల గుండా రాత్రింబవళ్లు ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ స్థాయిలో అక్రమ ఇసుక రవాణా సాగుతున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.

-ఆంధ్రజ్యోతి, యల్లనూరు

రీచ్‌లకు పర్మిషన్ ఇవ్వడంతోనే..

ప్రభుత్వం పదేళ్లుగా ప్రైవేటు, ప్రభుత్వ స్థలాల్లో ఇసుక తరలించడానికి విరివిగా అనుమతులు ఇవ్వడంతో ఎక్కడ పడితే అక్కడ నదిలో మట్టితో రహదారులను నిర్మిస్తున్నారు. రీచ్‌కాలం ముగిసిన వెంటనే రహదారి కోసం ఏర్పాటుచేసిన మట్టిని బయటకు తరలించాలి. దానిని అలానే వదిలేస్తున్నారు. ఈ రోడ్లు ఇసుక అక్రమ రవాణాకు అనువుగా మారుతున్నాయి.

ముప్పు అంచున కాజ్‌వేలు

ప్రధాన రహదారుల్లో చిత్రావతి నదిపై రెండుచోట్ల కాజ్‌వేలు ఉన్నాయి. ఈ కాజ్‌వేలకు దిగువప్రాంతంలో రీచ్‌లు ఏర్పాటు చేశారు. మూడేళ్ల క్రితం నది ఉధృతంగా ప్రవహించింది. ఆ సమయంలో నీరు నదిలో సజావుగా ప్రవహించకుండా రహదారులు ఉన్నచోట ఒక్కసారిగా కాజ్‌వేపైకి వచ్చింది. దీంతో శింగవరం, యల్లనూరు కాజ్‌వేలు కొట్టుకుపోయాయి.

ఈ సమయంలో యల్లనూరు నుంచి తాడిపత్రి, తిమ్మంపల్లి, పులివెందుల ఆర్‌అండ్‌బీ రహదారిపై రాకపోకలు నెలరోజులపాటు నిలిచిపోయాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని, అప్పట్లో రూ.2కోట్ల వ్యయంతో రహదారిపై కాజ్‌వేలకు మరమ్మతులు చేశారు.

పక్కపక్కనే రెండు రహదారులు

మండలకేంద్రం సమీపాన చిత్రావతి నదిలో రెండుచోట్ల ఇసుక తవ్వకాలు చేపట్టారు. ఇసుక తరలింపుకోసం ఇద్దరు వ్యక్తులు పక్కపక్కనే బెలుకు మట్టితో రోడ్లు వేశారు. ఒకేచోట రెండురీచ్‌లు ఉన్నా.. ఒక రహదారిపై మరొకరు వెళ్లకూడదని టిప్పర్ల ద్వారా మట్టిని తీసుకువచ్చి రహదారులను నిర్మిస్తున్నారు. ప్రైవేటు స్థలాల్లో ఇసుక తరలించడానికి అనుమతులు ఉన్నా నదిలో రహదారులను నిర్మించడానికి ఎవరు అనుమతి ఇచ్చారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నది పరీవాహక ప్రాంతాల్లోని పండ్లతోటలకు నదిలో నుంచి పైపులైన్ ఏర్పాటుచేస్తున్నారు. వీటిపై రహదారులు నిర్మించి భారీ వాహనాలు వెళితే పైపులైన్‌ను పగిలిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

మండలకేంద్రంలో జోరుగా ఇసుక రవాణా సాగుతున్నా.. నదిలో రోడ్లు వేస్తున్నా.. అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. మండలకేంద్రంలో పనిచేసే అధికారులు తాడిపత్రిలో నివాసం ఉంటూ రాకపోకలు సాగిస్తుంటారు. రోజూ రాకపోకలు సాగించాలంటే నది దాటాల్సిందే. ఆ సమయంలో నదిలో రోడ్ల పనులు అధికారులకు కనిపించడం లేదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కసాపురం రోడ్డు వెడల్పు చేయాలి

గుంతకల్లుటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కసాపురం రోడ్డులోని రైల్వే వంతెన కింద రోడ్డు వెడల్పు పనులు చేపట్టాలని సీపీఐ నాయకులు కోరారు. స్థానిక బీటీ పక్కీరప్ప భవనంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ కార్యదర్శి గోపినాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా కసాపురం రోడ్డు వెడల్పు పనులు చేపడతామని ప్రజాప్రతినిధులు హామీలు ఇస్తున్నారు తప్పా, పనులు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు సురేష్, జనసేవాదళ్ రాష్ట్ర ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, నాయకులు గడ్డం వెంకటేష్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

గుంతకల్లుటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని వైఎస్ఆర్ యుజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ బాసిత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు తరలిరావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. నక్క నరప్ప, గోవిందు, శీన, ప్రశాంత్, చిన్న పాల్గొన్నారు.

వైద్య పోస్టులను భర్తీ చేయాలి

గుంతకల్లుటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్‌కు సీపీఐ నాయకులు ప్రసాద్, నూర్‌బాషా విన్నవించారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రికి విచ్చేసిన డీసీహెచ్ఎస్‌తో నాయకులు సమావేశం అయ్యారు. వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో సీటీ స్కానింగ్, అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు.

16న దివ్యాంగులు, వయోవృద్ధుల గుర్తింపు

రాయదుర్గం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కణేకల్లు రోడ్డులో ఉన్న మోడల్‌స్కూల్‌లో 16వ తేదీన దివ్యాంగులు, వయోవృద్ధుల గుర్తింపు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. శిబిరంలో గుర్తింపు పొందిన వారికి అవసరమైన సహాయ జీవన పరికరాలైన చేతికర్రలు, వాకర్లు, వినికిడి యంత్రాలను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ పథకాలు అందాలంటే గుర్తింపు కార్డులు పొందాలని కోరారు.

122 మంది రక్తదానం

రాయదుర్గం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సమైఖ్యాంధ్రభవన్‌లో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 122 మంది రక్తదానం చేశారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కెంచె లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన శిబిరంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ విచ్చేసి దాతలకు మెమెంటోలు, ప్రోత్సాహక సర్టిఫికెట్లను అందించారు. జేవీవీ పట్టణ అధ్యక్షులు వీరన్న, గౌరవ అధ్యక్షులు అయూబ్‌ఖాన్, జగదీష్ పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1602.47	1,581.58
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	5,306	4.66
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	96	9
నీటి నిల్వ (టీఎంసీలు)	24.89	5.29

ఒక్కచాన్స్..!

● తుంగభద్ర ఆయకట్టుకు రెండోసారి నీరు అనుమానమే
● మూడు రాష్ట్రాల బోర్డు అధికారుల సమావేశంలో నిర్ణయం..

బళ్లారి గాంధీనగర్/కంప్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఆయకట్టు క్రస్ట్‌గేట్లకు కాలం చెల్లడంతో జలాశయానికి సంబంధించి 32 గేట్లను మార్చాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేసిన నేపథ్యంలో ఈ ఏడాది జలాశయంలో పూర్తి స్థాయిలో కాకుండా 80 టీఎంసీల నీరు నిలపాలని అధికారులు నిర్ణయించారు. దీంతో ఇంగా ఈ ఏడాది తుంగభద్ర ఆయకట్టు రైతులకు రెండో పంట అనుమానమే అని తెలుస్తోంది. ఇందుకు సంబంధించి జలాశయం సంబంధించి మూడు రాష్ట్రాల అధికారులు, సూపరింటెండెంట్ ఇంజనీర్ల సమావేశం బుధవారం ఆన్‌లైన్‌లో జరిగింది. నీటి సేకరణ, పంపిణీ గురించి ఇందులో సుదీర్ఘంగా చర్చించారు. జలాశయంలో 80 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేయాలని తుంగభద్రమండలి ఇప్పటికే నిర్ధారించిన మేరకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ సారి ఖరీఫ్‌లో అధికంగా వర్షాలు ఉన్నట్టు వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. జలాశయంలో 24 టీఎంసీల నీరు సంగ్రహణ జరిగింది. అయితే గరిష్టంగా 105.78 టీఎంసీలు చేరాల్సి ఉండగా , ఈ సారి సాధ్యం కాక పోవచ్చుని బోర్డు అధికారులు వివరించారు. తుంగభద్ర జలాశయం ఆనకట్ట ఎత్తు 1,633లు కాగా 1626 అడుగులకు నీరు చేరిన వెంటనే అదనంగా జలాశయానికి వచ్చే నీటిని నదికి విడుదల చేస్తున్నట్లు బోర్డు ఇంజనీర్లు తెలుపుతున్నారు. సాధారణంగా ఖరీఫ్ పంటలకు ప్రతి యేడాది కాలువల ద్వారా 80టిఎంసి నీటిని సరఫరా జరుగుతుంది. ఈ ఏడాదికూడా అందుకు ఇబ్బంది ఏమీ లేదు, 40 టీఎంసీల నీటిని తాగడానికి, పరిశ్రమలకు, ఇతరత్ర వాటికి రిజర్వు చేయనున్నారు. రబీ అవధిలో వర్షం వస్తే పరిస్థితి బట్టి నీటి లభ్యతను బట్టి జలాశయం నీరు లభించే అవకాశం ఉండవచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. సమావేశంలో కర్నూలు ఎస్ఈ బాలచంద్రారెడ్డి, అనంతపురం ఎస్ఈ పురంధన రెడ్డి, మునిరాబాద్ చీఫ్‌ఇంజనీయరు బసవరాజు, గద్వాల్ ఎస్ఈ రహిముద్దీన్, తుంగభద్ర మండలి ఎస్ఈ నారాయణ నాయక్‌లు పాల్గొన్నారు.



తుంగభద్ర జలాశయం



ట్రాక్టర్‌లో జనం

వాగులో చిక్కుకున్న ట్రాక్టర్

● 15 మందిని కాపాడిన స్థానికులు
●మస్కి సమీపంలోని వాగు వద్ద ఘటన

రాయచూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లున్న 15 మంది వాగులో చిక్కుకుపోగా స్థానికులు కాపాడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గురువారం ట్రాక్టర్ ఒకటి బురదమయమైన రోడ్డుపై వాగును దాటడానికి డ్రైవర్ ప్రయత్నించడంతో గుంతల్లో చిక్కుకుంది. ట్రాక్టర్ వాగుల్లో ఇరుక్కుపోవడంతో అందరూ బెంబేలెత్తారు. అయితే స్థానికులు వారిని కాపాడడంతో అందరూ ఒడ్డుకు వచ్చారు. జిల్లాలో రెండు రోజులుగా నిరంతరం వర్షాలు కురుస్తున్నాయి. వర్షం కారణంగా లోయలు నిండిపోయాయి. జిల్లాలోని మస్కి తాలూకా బళగానూరుకు అనుకుని ఉన్న చిక్క ఉద్బాళలోని బసవన్న ఆలయ దర్శనం కోసం భక్తులు, మస్కిలోని నారాయణ నగర్ క్యాంప్, చిక్క ఉద్బాళ మధ్య లోయను దాటుతున్నప్పుడు ఈ సంఘటన జరిగిందని భక్తులు తెలిపారు. వాగు ఉధృతంగా పొంగుతున్నప్పటికీ డ్రైవర్ దాటడానికి ప్రయత్నించడంతోనే ప్రమాదం జరిగినట్లు ప్రయాణికులు తెలిపారు. ఈ వాగుపై వంతెన నిర్మించడం వల్ల భక్తులకు, చుట్టుపక్కల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని గ్రామస్థులు అంటున్నారు.

మండలంలో భారీ వర్షం

సిరుగుప్ప, జూన్12(ఆంధ్రజ్యోతి): తాలుకా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. బుధవారం రాత్రి తాలుకాలో 35.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. టెక్కలకోట పట్టణంలో 35.6, సిరుగుప్పలో 34.0 మి.మీ. కరూరు, అచ్చొళ్లిలో 34.5 మి.మీ., సిరిగేరిలో 15 మి.మీ. వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల కారణంగా రోడ్లు గుంతలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వర్షం రాకతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మెట్టభూముల్లో విత్తనసాగు ప్రక్రియ ప్రారంభించారు.



బురదమయమైన నగర రోడ్లు



మాట్లాడుతున్న శాసన మండలి సభ్యుడు నవీన్ కుమార్

కేంద్రం సహకారంతోనే హంపి అభివృద్ధి

● శాసనమండలి సభ్యుడు నవీన్ కుమార్

బళ్లారి సిటీ,జూన్ 12(ఆంధ్రజ్యోతి): భారత పురావస్తు సర్వేసంస్థ(ఏఎస్ఐ) స్వతంత్రంగా పనిచేస్తుందని ఇది కేంద్ర ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ కిందకు రాదని శాసనమండలి సభ్యుడు నవీన్ కుమార్ అన్నారు. గురువారం హొసపేటలోని పత్రికాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హంపిలోనే కాదు ఇతర ప్రాంతాల్లోనూ అభివృద్ధి కుంటు పడుతోందన్నారు. దీనికి ప్రధాన కారణం పురావస్తు శాఖే అన్నారు. 2004-14 నాటి యుపీఏ ప్రభుత్వాలు, 2014-24 నాటి ఎన్డీఏ ప్రభుత్వాలు సాధించిన విజయాలు అసాధరణమైనవని వివరించారు. ఉపాధి కల్పన 2కోట్ల నుంచి 17కోట్లకు పెరిగింది. ద్రవ్యోల్బణం 8.2 శాతం నుంచి 5శాతానికి తగ్గింది. అత్యంత పేదల నిష్పత్తి పేదల నిష్పత్తి 29.2శాతం నుంచి11.3శాతానికి తగ్గింది ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంఖ్య 3.9 కోట్ల నుంచి 9.2కోట్లకు పెరిగిందన్నారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్ సంజీవరెడ్డి, నాయకులు అయ్యాలి తిమ్మప్ప,రాఘవేంద్ర, గంగప్ప, సూర్యపాపన్న, శంకర్‌మేటి,సిద్దయ్యస్వామి హొన్నూరప్ప, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి: సీఐ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మాంతేష్

బళ్లారిరూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, లేకపోతే జరిమానా తప్పదని పోలీసులు హెచ్చరించారు. బళ్లారి నగరంలో గురువారం వివిధ సర్కిళ్లలో బ్రూస్‌పేట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మహంతేష్ ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించాలని హెల్మెట్‌పై పలు అవగాహన కల్పించారు. సీఐ హెల్మెట్ లేని వారికి 30 నిమిషాల టైం ఇస్తానని అంత లోపల హెల్మెట్ పక్క తెచ్చుకోవాలని లేనియొడల రూ. 500 జరిమానా వేస్తామని నగరవాసులతో పాటు గ్రామీణ ప్రజలకు హెల్మెట్ వాడకంపై పలు విషయాలు తెలియజేశారు. హెల్మెట్ వాడకంపై మీ జీవితం మంచిగా వుంటుందని మీ కుటుంబం ఆధారపడి వుంటుందని వాహనదారులకు హెల్మెట్ అవగాహనపై పలు విషయాలు తెలుపుతూ పలువురికి జరిమానా విధించారు.

కేంద్రం దిగి రావాల్సిందే

● ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ బసవరాజ్ కళస హెచ్చరిక



దీక్షలో పాల్గొన్న పోరాట సమితి నాయకులు,కార్యకర్తలు

రాయచూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం సాగుతున్న చారిత్రక పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగి రావాల్సిందేనని ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డాక్టర్ బసవరాజ్ కళస అన్నారు. రెండున్నర ఏళ్లుగా నిరవధిక సమ్మె కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వం రాయచూరుకు ఎయిమ్స్ మంజూరు చేయకుండా జాప్యం చేస్తుండడం ఆశ్చర్యకరమన్నారు. నగరంలోని మహాత్మ గాంధి స్టేడియంలో నిర్వహిస్తున్న ఎయిమ్స్ నిరవధిక సమ్మె దీక్ష శిబిరంలో గురువారానికి 1127వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ బసవరాజ్ కళస, ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికగా ఉన్న ఎయిమ్స్‌ను మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులేమో అర్థం కావడం లేదన్నారు. ఎన్నికల సందర్భంగా ఎయిమ్స్ మంజూరుకు సమ్మతించిన ప్రజాప్రతినిధులు ఆ దిశగా ఎందుకు ప్రయత్నం చేయడం లేదని నిలదీశారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● వర్షంతో నష్టం కలగకుండా చూడాలి: తహసీల్దార్



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నరసప్ప

కంప్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కురుగోడు తాలుకాలోని గ్రామాల్లోని గ్రామలెక్క అధికారులు గ్రామ పంచాయతీ అధికారులు అప్రమత్తంగా వుండాలంటూ సమస్యలు తలెత్తకుండా చూడాలంటూ తహసీల్దార్ నరసప్ప తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నరసప్ప 2025-26 నాటి వర్షాకాలం సీజన్లో ప్రకృతి వికోపాలు జరిగిన వేళలో గ్రామాల్లో పంచాయతీ అధికారులు, గ్రామలెక్క అధికారులు అలర్ట్‌గా వుంటూ ఏఏ సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. ఏ గ్రామంలోనైనా ప్రకృతి వికోపం నుండి నష్టపోయిన వెంటనే అక్కడ చేరుకుని విషయాలు తెలుసుకుని పై అధికారులకు తెలియజేశాలా జాగ్రత్త వహించాలని తెలిపారు. కార్యక్రమంలో గెట్‌టు తహసీల్దార్ మల్లేశప్ప తాలుకా ఈవో నిర్మల, డీటీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కారులో మృతదేహం

● ఘటనపై అనుమానాలు

కనగానపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలంలోని దాదులూరు వద్ద 44వ జాతీయరహదిరిపై క్వాలీస్ వాహనంలో డెడ్‌బాడీ ఉండటం కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు....చిక్‌బళాపురంకు చెందిన రమేశ్ అనే యువకుడుక్వాలీస్ వాహనంలో ద్రాక్షను అనంతపురంకు తీసుకువచ్చాడు. అనంతరం తిరిగి గురువారం చిక్‌బళ్లాపురం వెళ్తున్నాడు.అయితే వాహనం దాదులూరువద్దకు రాగానే వాహనం మరమత్తుకు గురికావడంతో అదే గ్రామంలోని ఇద్దరు యువకులతో వాహనాన్ని తోయించుకున్న సీసీపుటేజ్‌లో రికార్డుఅయింది. అయితే రాత్రి అయినప్పటికి రోడ్డు పక్కన వాహనం ఉంది. దీంతో స్థానికులు అనుమానం వచ్చి వాహనంలోకి తొంగి చూడగా డ్రైవర్ సీటులో కింద ఓ వ్యక్తి మృతిచెందడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రామగిరి సీఐ శ్రీదర్, కనగానపల్లి ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీపుటేజ్‌లో రికార్డు అయిన దృశ్యాలతోపాటు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అయితే వాహన డ్రైవర్ అతిగా మద్యం సేవించి మృతిచెందాడా, వేరే ఇతర కారణాలున్నాయా అన్నది పోలీసుల విచారణలో తేలియాల్సి ఉంది. డ్రైవర్ రమేశ్ మద్యం ఎక్కువగా సేవిస్తాడని బంధువులు పోలీసులకు చెప్పినట్టు సమాచారం.



కారులో మృతదేహం

ఏ ఇంటిపైన చూసినా నల్లముచ్చులే..



షుగర్ ఫ్యాక్టరీలో మిద్దెపై కూర్చున్న నల్లముచ్చులు

కంప్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో ఏ ఇంటిపైన చూసినా నల్లముచ్చు కోతులే కనిపిస్తున్నాయి. ఉదయం సాయంత్రం వేళలో మహిళలు ఇండ్లలో నుండి బయటకి రావాలన్నా వణికిపోతున్నారు. అలాగే ఇంటి ప్రాంగణంలో ఆహారంకు సంబంధించిన ఏ వస్తువులైనా ఉంచినట్లయితే ఎత్తుకు పోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. గతంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి పై దాడి చేసిన సంఘటన కూడా వుండిపోయింటి. ఇళ్లలోకి ఎటు నుండి వస్తాయని మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పురసభ శాఖ అధికారులు నల్లముచ్చు కోతుల్ని అడవుల్లో వదలాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం అక్రమ అమ్మకాలను అరికట్టాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ సెక్రటరీ గిరిజాశంకర్

బళ్లారి సిటీ, జూన్12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ మద్యం అమ్మకాలు అరికట్టాలని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. సండూర్ పట్టణంలోని తాలూకా పంచాయతీ హాల్లో గురువారం తాలుకా స్థాయిలో అనేక విభాగాల ప్రగతి సమీక్ష సమావేశంలో ఈపీ డిప్యూటీ సెక్రటరీ గిరిజా శంకర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. తాగునీరు, పారిశుధ్యం తదితర సౌకర్యాలపై అధికారులకు సూచనలు అందజేశారు.

హొసూరు జోన్

నగరంలో జోరు వాన



వర్షంతో జలమయమైన రహదారి

హోసూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హోసూరు పరిసరప్రాంతాల్లో కురిసిన వర్షంతో చల్లదనం నెలకొంది. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం దాకా చుట్టుపక్కల ప్రాంతాల్లో 16మిమీ వర్షం నమోదైంది. డెంకణీకోట ప్రాంతంలో 5మిమీ వర్షం కురిసింది. కెలవరపల్లి ఆనకట్ట ప్రాంతంలో ఒక మిమీవర్షం కురిసింది. హోసూరులో కొన్ని రోజులుగా అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలతో ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శౌచాలయం నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే మునుసామికి వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

పాఠశాలలో హోసూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం శౌచాలయం నిర్మించాలని శూలగిరివాసులు వేపనహళ్ళి ఎమ్మెల్యే కేపీ మునుసామిని కోరారు. శూలగిరి సమీపంలోని ఉత్తనపల్లిలో ప్రభుత్వ హైస్కూల్ ఉంది. ఇక్కడ 370మంది బాలురు, 380మంది బాలికలు మొత్తం 750మంది విద్యార్థులు ఉన్నారు. వందలాదిమంది విద్యార్థులు ఉన్నా అందుకు తగినస్థాయిలో శౌచాలయ వ్యవస్థ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతితోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శూలగిరి సెంట్రల్ యూనియన్ కార్యదర్శి ఎస్‌వీఎస్ మాథేశ్ పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

● సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె




మాట్లాడుతున్న న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాల కార్మికు వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని, అధికారులు తల్లి దండ్రులు ,ఇతర సంస్థలు కలిసి అందుకు సహకరించాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి , సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె అన్నారు. జిల్లాలీగల్ సర్వీసెస్ అథారిటీ, జిల్లా పరిపాలన , జిల్లాపంచాయతీ, పాఠశాల విద్య ,అక్షరాస్యతశాఖ, కార్మిక శాఖ, పోలీసు శాఖ, జిల్లా బాల కార్మిక ప్రాజెక్టు, జిల్లా న్యాయవాదుల సంఘం. వివిధ శాఖలు ,ఇతర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో గురువారం నిర్వహించిన 'ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో పేదరికాన్ని రూపుమాపుతేనే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమన్నారు. పేదరికం, తల్లిదండ్రుల నిర్లక్ష్యం కారణంగా ప్రపంచవ్యాప్తంగా 16 కోట్ల మంది పిల్లలు బాల కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. ఈ అన్యాయమైన వ్యవస్థను తొలగించడానికి పిల్లలకు విద్యను అందించాలన్నారు. బాల కార్మికులను నిర్మూలించడం ప్రభుత్వాలు మాత్రమే చేయలేవని, ఇది పిల్లల బాల్యాన్ని దోచుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. విద్య ద్వారానే పేదరికాన్ని నిర్మూలించవచ్చన్నారు. 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ఉచిత,తప్పనిసరి విద్య ఉంది. ప్రభుత్వాలు విద్యకు ప్రాధాన్యమిస్తూ ప్రోత్సహిస్తున్నాయని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు పోలీస్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టవిరుద్ధమన్నారు. మీపరిసరాల్లో పిల్లలు టీనేజర్లు పనిచేస్తున్నట్లు మీరు గుర్తిస్తే మీరు హెల్ప్‌లైన్ నంబర్ 1098 లేదా 112 కు కాల్‌చేసి సమాచారం అందించవచ్చన్నారు. న్యాయవాది బాలల సంక్షేమ కమిటీ మాజీ సభ్యులు త్రివేణి పత్తర్ రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవంపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. ఈసందర్భంగా బాలల సంక్షేమ కమిటీ అధ్యక్షురాలు విజయలక్ష్మిమైదూర్,బళ్లారి సబ్ డివిజన్ కార్మిక అధికారి సిద్దప్ప,మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్, అధికారి రామకృష్ణ,జిల్లా బాలల రక్షణ యూనిట్ జిల్లా బాలల రక్షణ అధికారి జీరనాగప్ప, జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రామబ్రహ్మం, కార్యదర్శి గురుబసరాజ్, జిల్లా బాలల కార్మిక ప్రాజెక్టు డైరెక్టర్ మౌనేష్, లేబర్ ఇన్స్‌పెక్టర్ పరశురాం, రమేశ్, జిల్లా, తాలూకా స్థాయి అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగరం (హొస్పేట): పౌర సమాజం నుంఇ బాల కార్మిక వ్యవస్థను, బాల కార్మికులను పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు హొస్పేట్ ఏరియా విద్యాధికారి శేఖరప్ప తెలిపారు. నగరంలోని చిట్టవాడిగిలోని ప్రభుత్వ ప్రీ యూనివర్సిటీ కళాశాల ఆడిటోరియంలో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, తాలుకా న్యాయసేవల కమిటీ, పాఠశాల విద్యాకమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.

సిరుగుప్ప: పిల్లలను పనికి పంపకుండా బడికి పంపాలని సిరుగుప్ప తాలుకా సివిల్ న్యాయాధికారి అశోక్ తెలిపారు. గురువారం సిరుగుప్ప తాలుకా పరిధిలో ఆదోని రోడ్డు మార్గంలో మొరార్జీదేశాయ్ వసతి పాఠశాలలో బాలకార్మికుల నిర్మూలన వసతి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బాల కార్మిక నిర్మూలనకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ మద్దేరు సిద్దయ్య, డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థ , శివరాజు పాల్గొన్నారు.

రాయచూరు: సమాజంలో అత్యంత దురాచారంగా మారిన బాలకార్మిక పద్ధతి నిర్మూలను కోసం అందరి సహకారం అవసరమని న్యాయమూర్తి సాత్విక్ అన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయడంతో పాటు అన్ని వర్గాల ప్రజల సహకారం లభించినప్పుడే బాలకార్మిక పద్ధతిని నిర్మూలించగలమన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేఖ దినాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని జిల్లాధికారి కార్యాలయం వద్ద వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన బాలకార్మిక వ్యతిరేక జాతాను న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన 6 నుంచి 18 ఏళ్లలోపున్న బాలలందరూ విధిగా పాఠశాలల్లో ఉండాలని అందరికి విద్యనభ్యశించే అవకాశం దక్కినప్పుడే సమాజం మరింత వికసిస్తుందన్నారు.



జెండా ఊపి జాతాను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి సాత్విక్

హంపి పరిధిలో భారీ వర్షం



నీట మునిగిన పంట పొలాలు

బళ్లారి సిటీ/గాంధీనగర్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హొసపేట తాలూకాలోని హంపి పరిసరాల్లో బుధవారం రాత్రి నుంచి జోరువాన కురిసింది. తళవారఘట్ట ప్రదేశంలో విజయనగర రాజులు కాలం నాటి కాలువ నిండి రోడ్డుపై ప్రవహిస్తూ విజయవిఠల దేవస్థానికి వెళ్ళేరహదారి బంద్ అయింది. తళవారఘట్ట మహాద్వారం సమీపంలోనే కేవలం 1కిలోమీటర్ల దూరంలో గజ్జెల మంటపం దగ్గర వాహనాల నిలుపుదలస్థలంలో వాహనాలు నిలిపడానికి సాధ్యంలేదు. కమలాపురం వైపు నుండి వచ్చే ప్రవాసితులు సుమారు 5కిలోమీటర్లు చుట్టి విజయ విఠల దేవస్థానం చేరుకోవాల్సివచ్చింది. ప్రపంచ ప్రఖ్యాత గాంచిన రాతి రథం ఉన్న విజయవిఠల దేవస్థానానికి గజ్జెల మంటపం సుమారు 1కిలోమీటరు మట్టిరోడ్డులో నడిచి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



జలమయమైన విజయ విఠల దేవస్థాన రోడ్డు